క్లుప్తంగా

వేగంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు



సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

కోసిగి: కోసిగి ప్రజల దాహార్తి తీర్చేందుకు భూగేని చెరువులో చేపడుతున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి చెరువు లెవెలింగ్ పనులను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులు రూ.37 లక్షలతో భూగేని చెరువు లెవెలింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మరో వారంలో స్టోరేజీ ట్యాంక్ కరకట్ట పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఇక కేవలం పైప్‌లైన్ పనులు మాత్రమే వేయాల్సి ఉంటుందన్నారు. రెండు రోజుల్లో పైప్ లైన్ పనులు ప్రారంభిస్తామని, పులికనుమ ప్రాజెక్ట్ సమీపంలో మెయిన్ పైప్‌లైన్ నుంచి లిఫ్ట్ ద్వారా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ వరకు పైప్‌లైన్ వేసి తాగునీటి సరఫరా చేయిస్తామని చెప్పారు. పైప్‌లైన్ పనులు ముగిసిలోపే ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేస్తారని వివరించారు. ఎంపీపీ ఈరన్న, పార్టీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, నాడుగేని నాగరాజు, బుల్లి నరసింహులు, ప్రవీణ్‌కుమార్, రాముడు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను అడ్డుకోండి



టూటౌన్ సీఐ శ్రీరామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలాకొందరు ప్రవర్తిస్తున్నారని, పట్టణ శివారులోని మండిగేరిలో పురాతన ఎల్లమ్మ అమ్మవారి పుట్టను కూల్చడానికి ప్రయత్నించడమే కాకుండా అక్కడున్న 33 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు అర్లగేరి బసవన్నగౌడ్ తెలిపారు. బుధవారం ఆదోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టూటౌన్ సీఐ శ్రీనివాస్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల మధ్య బేధ భావం సృష్టించడంతో పాటు ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాపరెడ్డి,వీహెచ్‌పీ నగర అధ్యక్ష కార్యదర్శులు వీరన్న, నారాయణసింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు



వివేకానంద స్కూల్ ఏరియాలో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: మున్సిపాలిటీ పరిధిలో దెబ్బతిన్న,గుంతలు పడిన రోడ్లకు మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, సచివాలయ అడ్మిన్‌లు, సెక్రటరీలు పనులను బుధవారం పరిశీలించారు. ఎన్‌జీవోస్ కాలనీలోని వివేకానంద స్కూల్ ఏరియాలో గుంతలు పడిన రోడ్లపై తారు వేసి పూడ్చివేశారు. అవసరమైన చోట సిమెంట్ మిక్చర్ వేస్తున్నారని కమిషనర్ తెలిపారు.

13న హుండీ ఆదాయం లెక్కింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథస్వామి దేవాలయంలోని హుండీ ఆదాయం లెక్కింపు ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటల నుంచి చేపట్టనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ నిబంధనల మేరకు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు లుంగీ, కండువా ధరించి రావాలని సూచించారు.

20న ఉగాది వేడుకలు

కర్నూలు కల్చరల్: విజ్ఞాన సేవా సమితి (వీఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో ఉగాది మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కార్యవర్గ సభ్యులు తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వేత్త, రచయిత భాస్కర యోగి ప్రధాన వక్తగా హాజరు కానున్నట్లు తెలిపారు.

15 మంది బైండోవర్

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం 15 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి తెలిపారు. అలాగే మండలంలో 5 మందిని బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సునీల్‌కుమార్ చెప్పారు. పాత నేరస్తులు, నేర ప్రవృత్తి కలిగిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని పట్టణ, రూరల్ ఎస్ఐలు పేర్కొన్నారు.

పంట కాల్వలకు మహర్దశ

- రాంపురం, పల్లెపాడు కాల్వలకు రూ.11.20కోట్లతో మరమ్మతులు
- తీరిన సాగు నీటి కష్టాలు
- 3,400 ఎకరాల్లో రెండు పంటల సాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



రూపుదిద్దుకున్న రాంపురం పంట కాల్వ



పల్లెపాడు కాల్వకు లైనింగ్ పనులు చేపట్టిన దృశ్యం

మంత్రాలయం:రైతన్నల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం శాయశక్తులు ఒడ్డుతోంది. వైఎస్సార్ జలయజ్ఞం , వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా తదితర సంక్షేమ పథకాలతో రైతు శ్రేయస్సుకు పాటుపడుతోంది. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన పంట కాల్వలకు మహర్దశ తీసుకొచ్చింది. నియోజకవర్గంలో ఇటీవల పలు పంట కాల్వల మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు నీరందేలా చర్యలు చేపట్టింది.

రూ.11.20 కోట్లతో పనులు..

మంత్రాలయం మండలంలోని రాంపురం , కోసిగి మండలంలోని పల్లెపాడు తుంగభద్ర దిగువ కాల్వ మరమ్మతులు చేపట్టారు. వైఎస్సార్ జలయజ్ఞం కింద రూ.10 కోట్లతో రాంపురం పంట కాల్వ లైనింగ్ పనులు పూర్తి చేశారు. దాదాపు 10 కి.మీ. పొడవున లైనింగ్ సీసీ నిర్మాణాలు చేయించారు. అలాగే కోసిగి మండలం పల్లెపాడు ఎల్లెల్సీ కాల్వను సీఏడీఏ (కమాండింగ్ ఏరియా డెవలప్ మెంట్ అ. థారిటీ) నిధులు రూ.1.20 కోట్లతో మరమ్మతులు చేశారు. దాదాపు 2కి.మీ. మేర పూడిక, ముళ్లకంపలను తొలగించి సీసీ లైనింగ్ ఏర్పాటు చేశారు.

తీరిన సాగునీటి కష్టాలు..

ఎన్నో ఏళ్లుగా ఆయా పంట కాల్వలను పట్టించుకోకపోవడంతో పూడికతో నిండిపోయి కాలువలు ధ్వంసమై రూపును కోల్పోయాయి. పలు చోట్ల ఆక్రమణలకు పాల్పడటంతో కాల్వలు మనుగడను కోల్పోయాయి. దీంతో దిగువనున్న ఆయకట్టు పొలాలను నీరందకపోవడంతో వర్షాధార పంటలతో రైతులు సరిపెట్టుకుంటున్నారు. రాంపురం కాల్వ పరిధిలో 2,600 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందకుండా పోయింది. అలాగే పల్లెపాడు కాల్వ పరిధిలో డి.బెళగల్, చింతకుంట, పల్లెపాడు గ్రామాలకు సాగునీరు అందడం అగమ్యగోచరంగా మారింది. కాల్వ పరిధిలో దాదాపు 800 ఎకరాలకు సాగునీరు అందేది కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమస్యను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో రెండు కాల్వలకు మరమ్మతులు చేయడంతో రైతుల సాగునీటి కష్టాలు గట్టెక్కాయి. తమ పొలాలకు పుష్కలంగా సాగునీరు అందుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు కార్లు పండిస్తున్నాం



ఈ ఏడాది ఎల్లెల్సీ కాల్వ నుంచి సాగునీరు ప్రవహించడంతో ఖరీఫ్, రబీ సీజన్‌లలో రెండు కార్లు పండించుకున్నాం. గతేడాది వరకు కాల్వ గట్లు పడిపోయి, ముళ్ల పొదలు పెరిగి పోయి కాల్వ కనిపించకుండా పోయింది. దీంతో సాగునీరు ప్రవహించడం కనుమరుగైంది. ప్రభుత్వం కాల్వకు మరమ్మతులు చేయించడంతో సంతోషకరం.

– భీమయ్య, రైతు, డి.బెళగల్

పుష్కలంగా సాగునీరు



డి.బెళగల్ ఎల్లెల్సీ కాల్వ కింద 5 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. దాదాపు 20 ఏళ్లుగా కాల్వకు మరమ్మతులు చేపట్టక పోవడంతో పొలాలకు సాగునీరు అందకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వం కాల్వకు మరమ్మతులు చేపట్టడం పుష్కలంగా సాగునీరు ప్రవహిస్తోంది. 5 ఎకరాల్లో మిరప, ఉల్లి పంటలు సాగుచేసుకున్నాం. దిగుబడులు కూడా ఆశాజనకంగా వచ్చాయి.

– తిక్కయ్య, రైతు, డి.బెళగల్

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశం



రిబ్బన్‌కట్ చేసి గృహ ప్రవేశం చేస్తున్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలో ఎమ్మిగనూరు రహదారిలోనున్న జగనన్న కాలనీల్లో కె.అనురాధ అనే లబ్ధిదారురాలు నూతనంగా నిర్మించిన ఇంటిని వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, జనార్ధన్‌రెడ్డి, రాఘవేంద్ర ఆచారి,శివ తదితరులు ఉన్నారు.

ఆదర్శంగా నిలవండి

కర్నూలు: ట్రాఫిక్ నిబంధనల అమలులో విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలవాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. కల్లూరు మండలం దూపాడు దగ్గర ఉన్న కేవీ సుబ్బారెడ్డి ఫార్మా కాలేజీలో బుధవారం విద్యార్థినులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ నిబంధనలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడిన వీడియో చిత్రాలను ప్రొజెక్టర్‌లో ప్రదర్శించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే విద్యార్థులు పోలీసు కేసుల్లో ఇరుక్కుంటారని తెలిపారు. లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి

కౌతాళం: ఈనెల 13వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కౌతాళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు 9మంది ఉన్నారని అలాగే పట్టభద్రులు మండలంలో 744 మంది ఉన్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ నంబర్లు కూడా వేశామన్నారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు.



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత



బహుమతులు అందజేస్తున్న అధికారులు



మార్కెట్ యార్డు చైర్మన్ శరణమ్మను సన్మానిస్తున్న విద్యార్థిని

ఘనంగా మహిళా దినోత్సవం



మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని టౌన్: మహిళా దినోత్సవం వేడుకలను బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు.కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డు సచివాలయాల మహిళా ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. ముందుగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కమిషనర్ మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు.

ఆదోని అర్బన్ : పట్టణంలోని మిల్టన్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత పాల్గొని కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు సమానత్వాన్ని సాధించాలన్నారు.

ఆదోని రూరల్: మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆదోని రెండో అదనపు కోర్టు జడ్జి పి.జె.సుధ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదోని రెండో అదనపు కోర్టు జడ్జి పి.జె.సుధ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీల పాత్ర పెరుగుతోందన్నారు. అనంతరం మెజిస్ట్రేట్ శ్రీకాంత్ మాట్లాడుతూ బాలనేరస్తుల్లో సత్ప్రవర్తన తీసుకొని రావడానికి మాతృత్వంతో వారిని ఆదరించాలని సూచించారు. పీడీఎం న్యాయమూర్తి హిమబిందు మాట్లాడుతూ కుటుంబం సక్రమమార్గంలో నడుచుకోవడంతో స్త్రీ పాత్ర కీలకమైందన్నారు. న్యాయవాదులు శివకుమార్‌స్వామి, సావిత్రి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా పోలీసులను సన్మానించారు. ఏఎస్ఐ ఆనంద్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కౌతాళం: మండలంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక మహిళా మండల సమైక్య కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. పొదపు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపు పొందిన వారికి బహుమతులు అందజేశారు. ఏపీఎం రాజశేఖర్, సీపీ బజారప్ప, మంజునాథ్, వివోఏలు, రిలయన్స్ ఫౌండేషన్ భాస్కర్, వెంకటేశ్వర్లు, పొదపులు మహిళలు పాల్గొన్నారు.

కోసిగి: మహిళలు విద్యా వంతులై అన్ని రంగాల్లో రాణించాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి , కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ పుష్పలత పేర్కొన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ కుమారి అయ్యమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మెన్ శరణమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం హీరో షోరూమ్ నిర్వాహకులు బసవరాజు ఆధ్వర్యంలో ఉద్యోగినులు, ప్రజా ప్రతినిధులను సన్మానించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా హోలీ సంబరాలు



కోసిగిలో రంగులు చల్లుతూ సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

కోసిగి: మండల కేంద్రంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా చౌడమ్మ వీధిలో కామప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి కామప్ప బొమ్మను దహనం చేసి సంబరాలు ప్రారంభించారు. చౌడమ్మ వీధి, మారెమ్మ దేవి కాలనీ, చింతలగేని వీధి, కడపాళెం, బస్టాండ్ సమీప కాలనీలో చిన్నారులు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ సంబరాలు జరుపుకున్నారు.


మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలో బుధవారం హోలీ వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో కామదహనం కానిచ్చారు.ఉదయం యువతీ,యువకులు ఒకరిపై ఒక్కరు రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు.

గంగవరంలో మారెమ్మ దేవర



మారెమ్మవ్వకు భోనాలు తీసుకెళుతున్న భక్తులు

నందవరం: డప్పు దరువులు, మేళతాళాల మధ్య గ్రామ దేవర ఘనంగా జరిగింది. పురవీధుల్లో బారులు తీరిన భక్తుల మధ్య కుంభోత్సవం కనువిందు చేసింది. బుధవారం మండల పరిధిలోని గంగవరంలో గ్రామ దేవత మారెమ్మవ్వ దేవర నిర్వహించారు. నూతన ఆలయంలో మారెమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి విశిష్ట పూజలు నిర్వహించారు. వేకువజామున గ్రామ దేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు చేపట్టారు. సంప్రదాయంలో భాగంగా అమ్మవారికి భోనాలు నైవేద్య సమర్పణ గావించారు. వేకువజామున బలిదానాలు కానిచ్చి ఉదయం కుంభోత్సవాలు నిర్వహించారు. డప్పుల దరువులతో అమ్మవారికి భక్తులు భోనాలు సమర్పించారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పిండి వంటలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బలిదానాలు కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దేవర ఉత్సవంలో సర్పంచ్ బైటిగేరి శివన్న, మాజీ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీ విజయ్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



ఈత సరదా

హోలీ పండుగ సందర్భంగా రెండు రోజులు సెలవులు రావడంతో బుధవారం ఆస్పరిలోని పెద్దబావిలో విద్యార్థులు ఈదులాడుతూ కేరింతలు కొట్టారు. కొంత మంది బావిలో మెట్లపై ఈత నేర్చుకుంటున్నారు. ఇటీవల సర్పంచ్ మూలింటి రాధమ్మ పెద్దబావిని పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించడంతో నీరు పుష్కలంగా ఉన్నాయి. వేసవి కావడంతో ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు విద్యార్థులు, యువకులు పెద్దబావిలో ఆనందంగా ఈత కొడుతున్నారు. –ఆస్పరి

వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయండి



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో పట్టభద్రులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఓటు ఎలా వేయాలో నమూనా బ్యాలెట్ పేపర్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, కోసిగి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, మాజీ ఎంపీపీ రఘురాముడు, నాయకులు రవిచంద్రరెడ్డి, గజేంద్రరెడ్డి, శివారెడ్డి, నవీన్‌రెడ్డి జాము మూకన్న, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

ఆదోనిటౌన్:పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవా కోరారు. బుధవారం శంకర్‌నగర్, మహాత్మాగాంధీ నగర్, ఎస్కేడీ కాలనీ ప్రాంతాల్లో పట్టభద్రులు ఉన్న ఇళ్లను సందర్శించి ఓటు వేయాలని అభ్యర్థించారు. 22వ వార్డు కౌన్సిలర్ ఎస్.పి.లక్ష్మిదేవి, వార్డు ఇన్‌చార్జి, మంజుల, నాయకులు, కార్యకర్తలు నల్లారెడ్డి, నరసప్ప, రమేష్, తాయన్న, దస్తగిరినాయుడు, నబి పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: ఈనెల 13వ తేదీ జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రరెడ్డి గెలుపునకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జి.భీమిరెడ్డి,విశ్వనాథ్‌రెడ్డి కోరారు.బుధవారం మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి,మాలపల్లి,పి.తండా,సింగరాజనహళ్లి గ్రామాల్లోని పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు.

కోసిగి: ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రా రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగనన్నకు కానుకగా ఇద్దామని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కొండుగానీ వీధి, కాశమ్మ గడ్డ, కడపాళెం, ఎస్సీ కాలనీ, చింతలగేని వీధి, కొత్తపేట, ఈశ్వర దేవాలయం, రంగప్ప గట్టు, నాడుగేని వీధి కాలనీలోని పట్టుభద్రుల ఇళ్లకు తిరిగి కరపత్రాలు అందజేశారు.

వైభవంగా గరుడోత్సవం



గరుడ వాహనంపై ఆశీనులైన శ్రీవారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామివారికి బిందెసేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుంచారు. అనంతరం పల్లకీలో గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో జనవాహిని మధ్య ఊరేగించారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, సిబ్బంది రఘు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పారదర్శకంగా శనగ కొనుగోళ్లు

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో చేపట్టిన శనగ దిగుబడుల కొనుగోళ్లను అవకతవకలు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆలూరు డీసీఎంఎస్ ఇంచార్జ్ ప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తూకాల్లో మోసాలు లేకుండా ఒక సంచికి 51.200 కేజీల చొప్పున (సంచి బరువు కలిపి) తూకం వేసి తీసుకుంటున్నామన్నారు. శనగలు జల్లెడ పట్టి, తూకం తర్వాత బస్తాలను లారీల్లో లోడు చేసేందుకు అయ్యే హమాలీ ఖర్చును మాత్రం రైతు భరించాల్సి ఉందన్నారు. గోనె సంచులు, లారీ రవాణా ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు.